క్లుప్తంగా

కుటుంబ సభ్యుల చెంతకు అభాగ్యురాలు



పద్మను ఆమె కుమార్తెకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం : రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న 60 ఏళ్ల పద్మ అనే మహిళను ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ఆమెను జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు. ఆమె నుంచి వివరాలు సేకరించారు. ఆమెది గాజువాక దరి గంట్యాడ అని తెలియజేయడంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం ఆమెను వ్యానులో తీసుకెళ్లి ఆమె కుమార్తెకు అప్పగించారు. ఆమె మానసిక స్థితి బాగులేదని, ఊరూరా తిరుగుతుందని పద్మ కుమార్తె తెలిపింది. ఆమెకు పింఛన్ కూడా వస్తుందని తెలియజేసింది. ఆమెను ఇల్లు కదలకుండా చూసుకోవాలని వాసు పద్మ కుమార్తెకు సూచించారు.

ఏపీ పీజీ సెట్‌లో ఏవీఎన్ విద్యార్థి ప్రతిభ



దాసరి కార్తికేయ

అల్లిపురం : ఏపీ పీజీ సెట్‌లో మిసెస్ ఏవీఎన్ కళాశాలలో చదువుతున్న బీఎస్సీ విద్యార్థి దాసరి కార్తికేయ గణాంక శాస్త్రంలో రాష్ట్రంలో 18వ ర్యాంకర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు విద్యార్థిని అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అకడమిక్ డీన్ జి. శంకర్‌నారాయణరావు, గణాంక శాస్త్ర హెచ్‌వోడీ గాంధీ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు కార్తికేయ కు అభినందనలు తెలిపారు.

దివంగత ప్రధాని పీవీకి నివాళి



పేదలకు అన్నదానం చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, శ్రీవత్సవ్

జగదాంబ : దివంగత ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని స్వామి వివేకానంద సంస్థలో శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శ్రీవత్సవ్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు గొప్ప మేధావి అన్నారు. బహుభాషా పండితులని కొనియాడారు. ఈ సందర్భంగా సంస్థలోని వృద్ధులకు పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమల్, రాథోడ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న అతిథులు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆమె విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను అందజేశారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన సత్యనారాయణస్వామి ఆలయం



రోజ్‌హిల్స్‌పై మేరీమాత గుడి




స్టేడియం రోడ్డులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం

దక్షిణం.. ఆధ్యాత్మిక వైభవం

- పురాతన ఆలయాలు.. మసీదులు.. చర్చిలతో దివ్య శోభ
- సర్వమత సమ్మేళనంగా వెలుగుతున్న పాతనగరం
- ఒక్కటై జీవిస్తున్న హిందూ.. ముస్లిం.. క్రిస్టియన్లు

దక్షిణ నియోజకవర్గం సర్వమత సమ్మేళనంలా వెలుగులీనుతోంది. ఇక్కడ హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు అంతా కలిసే జీవిస్తున్నారు. ఇక్కడి ఆలయాలు కూడా అన్ని మతాలు ఒకటే సారాన్ని బోధిస్తున్నట్లు దగ్గర దగ్గరగానే కనిపిస్తుంటాయి. ఆలయాలు, చర్చిలు, మసీదులతో ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా సందడి చేస్తుంటుంది. ఆయా పర్వదినాల సమయంలో అంతా కలిసి మెలిసి పండగలు చేసుకోవటం ఈ ప్రాంత ప్రత్యేకమని చెప్పాలి.



కోటవీధిలో దర్గా



పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ ఆలయం



పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయం

దాబాగార్డెన్స్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. ఒకప్పుడు పాతనగరమే విశాఖపట్నానికి ఆయువుపట్టు. ఓ వైపు వస్త్ర దుకాణాలకు నెలవైన దక్షిణ నియోజకవర్గం మరోవైపు ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. ఉత్తరాంధ్ర కల్పవల్లిగా.. విశాఖ వాసుల ఆరాధ్య దైవంగా సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు పాతనగరంలోని బురుజుపేటలో వెలిసారు. పలు పురాతన ఆలయాలు కూడా ఇక్కడే కొలువై ఉన్నాయి. మరీ ముఖ్యంగా పాత పోస్టాఫీస్‌కు కూతవేటు దూరంలో ఒకే కొండపై మూడు మతాలకు చెందిన వేంకటేశ్వరస్వామి, కోటవీధి దర్గా, రోజ్‌హిల్స్‌పై మేరీమాత గుడి ఉండేవి. పోర్టు విస్తరణ నేపథ్యంలో ఆ కొండను మూడు భాగాలుగా విభజించారు. ఓ కొండపై వేంకటేశ్వరస్వామి, మరో కొండపై కొండ గుడి, మరో కొండపై దర్గా ఉన్నాయి. అంతే కాక అన్నవరం సత్యనారాయణ స్వామి అంతటి ప్రాచుర్యం పొందిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం ఇసుకకొండ (బాబాజీకొండ)పై కొలువై ఉంది. పురాతన శివాలయాలు, దశాబ్దాల చరిత్ర గల విఘ్నేశ్వరుని ఆలయాలతో పాటు వీధి వీధిన రామాలయాలతో దక్షిణ నియోజకవర్గం ఆధ్యాత్మికంగా ప్రాచుర్యం పొందుతోంది. అంతే కాక మార్వాడీలు (ఉత్తర భారతీయులు) ఆరాధించే బోలో శంకరుని ఆలయం, శ్యాంబాబా ఆలయం ఇలా ఎన్నో పుణ్యక్షేత్రాలు, మసీదులు, చర్చిలకు నిలయంగా పాతనగరం ఆధ్యాత్మిక కాంతులీనుతోంది. ఆయా పండగలు.. పర్వదినాల సమయంలో భక్తుల కోలాహలం.. సందడితో ఆలయాలు, చర్చిలు, మసీదులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటూ ఉంటాయి.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారు



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 0891-2566514, 8985515989 నంబర్లు, వాట్సాప్ ద్వారా సేవా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వెల్ఫేర్ బోర్డు పథకాలు కొనసాగించాలి

సీఐటీయూ డిమాండ్



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం విశాఖ జిల్లా అధ్యక్షురాలు అనసూయ

అల్లిపురం : భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కరోనా సమయంలో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడినప్పుడు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎటువంటి సాయం అందలేదన్నారు. వెల్ఫేర్ బోర్డులో వున్న సొమ్మును కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ, పూర్వ ప్రధాన కార్యదర్శి జి.పోలేశ్వరరావు, కె.నర్సింగరావు, రమణ, లక్ష్మణ, రాజు, చంద్రరావు, సూరప్పడు అన్ని జోన్ల కార్మికులు పాల్గొన్నారు.

పార్కింగ్ కోసం గడువు పెంపు

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలో ఖాళీ స్థలంలో పార్కింగ్ కోసం ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహణ ఇచ్చిన గడువును పెంచారు. జులై ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలం కోసం తొలుత ఈనెల 28వ తేదీ(శుక్రవారం) నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ కారణాల వల్ల ఈ గడువును జులై 5వ తేదీ వరకు పొడిగించారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతు బజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జిల్లా ఇన్‌జార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను శనివారం నుంచి వచ్చేనెల 5వతేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు అందజేయాలని, 5న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇవ్వడం జరిగిందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్.నంబరు 8.202/2, ఆర్‌ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం-530029ను సంప్రదించాలి. లేదా ఫోన్ 9030819082కు సంప్రదించాలి.

రైతుబజార్‌లో హోల్‌సేల్ టమోటా విక్రయాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న టొమోటాలు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో హోల్‌సేల్ టమోటా అందుబాటులోకి వచ్చింది. కొద్ది రోజులుగా టమోటా ధర ఆకాశాన్ని అంటిన విషయం తెలిసిందే. రైతుబజార్లలోనే కిలో రూ.68, రూ.70 చొప్పున విక్రయించారు. ఈ ధరను నియంత్రించాలనే ఆలోచనతో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్‌లో వినియోగదారులకు హోల్‌సేల్ ధరలకు టమోటా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎంవీపీ రైతుబజార్‌కు సుమారు 3 టన్నుల టమోటా తీసుకొచ్చి హోల్‌సేల్ ధరకు అందుబాటులో ఉంచారు. వినియోగదారులకు కిలో టమోటా రూ.46కి విక్రయించారు. దీంతో రైతుబజార్ షాపులలో వ్యాపారులు కూడా కిలో టమోటా అదే ధరకు విక్రయించాల్సి వచ్చింది. ధరలు నియంత్రణలో భాగంగా మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లి నుంచి టమోటా తీసుకువచ్చి రైతుబజార్‌కు సరఫరా చేసినట్లు ఎంవీపీ రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు. ఈ టమోటా ధర ఇంకా తగ్గే అవకాశం ఉన్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ సమయంలో టమాటా ధర పెరిగిన సమయంలో ఇలా ప్రత్యేక కౌంటర్లలో కిలో రూ.25కే విక్రయించేవారని పలువురు వినియోగదారులు చర్చించుకున్నారు.

యునిసెఫ్ సమ్మిట్‌కు ఓక్రిడ్జ్ విద్యార్థుల హాజరు



హ్యూస్టన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: ఇటీవల హ్యూస్టన్‌లో జరిగిన యునిసెఫ్ సమ్మిట్ ఎస్‌ఏఈలో భీమిలి మండలం శింగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన సమస్యలు చర్చించి పరిష్కారాలు సాధించడానికి జరిగిన ఈ సమ్మిట్‌లో ఓక్రిడ్జ్‌కు చెందిన ఎస్.సూర్యతేజ్, వి.అన్యా, బి.సృజన్ పాల్గొన్నారు. సమ్మిట్‌లో అద్భుతమైన నాయకత్వం, పట్టుదల ప్రదర్శించారని స్కూల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యుత్‌తో మొదలుకుని పర్యావరణ మార్పుల వరకు వివిధ అంశాలపై విద్యార్థులు లోతైన చర్చల్లో పాల్గొన్నారని పేర్కొంది. ఈ సమ్మిట్‌లో నార్త్ ఆంగ్లియాకు చెందిన 120 కంటే ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల అభినందించారు.

రక్తహీనతకు చెక్ పెడదాం

తగరపువలస: ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం ఆనందపురం మండలంలో పర్యటించింది. బోయిపాలెం, చందక, గంభీరం పంచాయతీల్లో వైద్యశాఖ, ఐసీడీఎస్ శాఖల పనితీరును పరిశీలించిన తరువాత బోయిపాలెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రక్తహీనతను నివారించే మాత్రలు ప్రతి శుక్రవారం ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులను పరిశీలించారు. గంభీరం, చందకలలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీనతకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. ఈ బృందంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ కేంద్ర కార్యాలయ అధికారి డాక్టర్ ఎస్.పూజిత, ఎనీమియా ముక్తి భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి సమత, డాక్టర్ హీనా దీక్షిత్, ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి గంగునాయుడు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ అధికారి మనోరమ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే దోమల నిర్మూలన



మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది



పాతనగరంలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

సీతమ్మధార : మలేరియా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరివీధి, చుక్కా వారి వీధి, పాలికల వీధి, రామాలయం వీధి, మండా వారి వీధిలో ర్యాలీ నిర్వహించారు. దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ జ్వరాల గురించి ప్రజలకు వివరించారు. దోమలు ఉత్పత్తి చెందకుండా ఎలా నివారణ చర్యలు తీసుకోవాలో వివరించారు. వారం పైబడి నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇళ్లలో ఫ్రిడ్జిలు, ఏసీల ద్వారా వచ్చే నీరు వారం పైబడి ఉంటే దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. ఆ నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని తెలిపారు. ఈ ర్యాలీలో పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది, మలేరియా విభాగం ఉద్యోగులు ఎల్.శ్రీనివాస్, ఏఎన్ఎం లోవకుమారి, జీవీఎంసీ మలేరియా విభాగం సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.ఎన్. నారాయణ (శివ), ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమల వృద్ధిని అరికట్టాలి..

జగదాంబ : నివాసిత ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. శుక్రవారం యాంటీ లార్వా ఆపరేషన్‌ను పాతనగరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగం సిబ్బందితో కలిసి ఆయన అన్ని వీధుల్లో ఇళ్ల వద్ద నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలను సిబ్బంది తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఇళ్ల పరిసరాల్లోని నీటి కుంటల్లో దోమలు వృద్ధి కాకుండా మలేరియా సిబ్బంది ఫినాయల్ వేశారు. ఈ నేపథ్యంలో ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాతనగరంలో ఎక్కడా మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలకుండా ఏఎన్ఎంలు, మలేరియా సిబ్బంది ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, సెక్రటరీలు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లా ఉపాధి కార్యాలయం, కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రెండు రోజుల పాటు జరిగే ఈ మేళాను ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ మేళాకు తొలిరోజు శుక్రవారం 1220 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెక్ మహీంద్ర, పాత్ర కంపెనీలో 328 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.67 లక్షలు నుంచి రూ.2.50 లక్షలు ప్యాకేజ్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ గీతాంజలి, జేకేసీ కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు చెడ్డ పేరు తెస్తే ఉపేక్షించేది లేదు

సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



మహారాణిపేట : కేజీహెచ్‌లో కొంత మంది నర్సుల వల్ల ఆస్పత్రికి చెడ్డ పేరు వస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లోని ఎథిక్స్ గ్యాలరీలో నర్సులను ఉద్దేశించి మాట్లాడారు. కొంత మంది నర్సులు ఆకాశరామన్న ఉత్తరాలు రాసి వ్యతిరేకంగా పని చేస్తున్నారన్నారు. ఇక్కడ 700 మంది నర్సులు పని చేస్తున్నారని.. వారిలో కొందరు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇటీవల ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితులను ఆయన ప్రస్తావించారు. తనకు ఎవరి మీద వ్యతిరేకత లేదన్నారు. అయితే కేజీహెచ్‌కు చెడ్డ పేరు తీసుకొస్తే మాత్రం ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు జరిగిన దాని కోసం తాను ప్రస్తావించడం లేదన్నారు. రేపటి నుంచి నర్సులు గాని, ఇతర స్టాఫ్ గాని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధి గొల్లసేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు, బాలభోగం, శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన జరుగుతాయి.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.